క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆటోనగర్ ఫీడర్ పరిధి కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు, 11కేవీ డీర్ పార్కు ఫీడర్ పరిధి కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పరిహారం ఇప్పించాలని వినతి


సబితారెడ్డితో బాచుపల్లి వాసులు

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లికి చెందిన పగడాల రాఘవేందర్ నాలుగేళ్ల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో వరదల్లో చిక్కుకొని మృతి చెందాడు. కాగా శనివారం అతని కుటుంబీకులు మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే సబితా రెడ్డిని కలిసి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని కోరారు. అప్పట్లో నాటి ప్రభుత్వం నష్టపరిహారం కింద రూ.4 లక్షలు ప్రకటించి మంజూరు చేసినప్పటికీ.. అవి నేటికీ అందలేదని ఆమె దృష్టికి తెచ్చారు. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని వాపోయారు. ఈ విషయమై సబితారెడ్డి ఫోన్‌లో ఆర్డీఓతో మాట్లాడి వారికి మంజూరైన పరిహారం అందించి, న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ధామస్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మున్సిపల్ కమిషనర్ వాణి

మహేశ్వరం: హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం వడ్డించాలని అమీర్‌పేట్ బీసీ హాస్టల్ ప్రత్యేకాధికారి, తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. శనివారం మండల పరిధి అమీర్‌పేట్ గ్రామం బీసీ హాస్టల్‌ను ఆమె సందర్శించి మాట్లాడారు. హాస్టల్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. సంపు, ట్యాంకులను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వార్డెన్ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు హాస్టల్‌లో సంపు, ట్యాంకు, వంట సామగ్రిని పరిశీలించారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి బాలాపూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రకరకాల వంటకాలు చేసి, రుచి చూపించారు. అనంతరం విద్యాసంస్థల చైర్మన్ పి.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్యం నుంచే వంటకాలు చేసే విధానం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌శైలజ, డైరెక్టర్ శివ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే

బడంగ్‌పేట్: స్థానిక ప్రైవేట్ పాఠశాలలో శనివారం ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే నిర్వహించారు. తాతలు, అమ్మమ్మలకు, నానమ్మలకు సరదాగా పోటీలు నిర్వహించారు. మనుమలు, మనుమరాళ్ల ఆనందాలు, సంతోషాల కోసం గ్రాండ్ పేరెంట్స్‌లు ఆటలు ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తార మాట్లాడుతూ.. తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు ధనం కన్నా ఇంట్లో, సమాజంలో విలువైన ఆస్తులన్నారు. పోటీ ప్రపంచంలో ముసలి వాళ్లయిన పెద్దలను దూరం పెట్టవద్దని, వారిని గౌరవంతో చూసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వృద్ధాశ్రమాలను తగ్గించి, ఇళ్లనే ఆశ్రమంగా చేసుకోవాలని వెల్లడించారు. విలువలకు ప్రాధాన్యతనిచ్చిపుచ్చుకోవాలని పెద్దలను గౌరవించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రాండ్ పేరెంట్స్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

హెల్త్ సూపర్‌వైజర్ నిర్మల

మొయినాబాద్‌రూరల్: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామీణ ప్రాంత వాసులకు అనేక విధాలుగా చికిత్స అందజేస్తున్నామని హెల్త్ సూపర్‌వైజర్ నిర్మల, బాకారం సబ్‌సెంటర్ డాక్టర్ దినేశ్‌గౌడ్‌లు తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఏఎన్ఎం భారతి ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్, పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ నిర్మల పాల్గొని వ్యాక్సినేషన్, పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు చిన్నారులకు వ్యాక్సిన్, పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

- నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాలు
- మూడురోజుల పాటు కొనసాగనున్న కార్యక్రమాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


వేడుకలకు ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

మహేశ్వరం: శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ఉత్సవాలకు అమీర్‌పేట్ గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం విద్యుత్, దీపాలు, రంగుల రంగులతో ముస్తాబైంది. ప్రతి సంవత్సరం ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని పూజా కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ తెలిపారు. ఆలయంలో పూజా కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమై మంగళవారం ముగుస్తాయని, ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

రోజువారీ కార్యక్రమాలు..

- 24వ తేదీ ఆదివారం కార్తీక బహుళ నవమి ఉదయం మహాగణపతి ఆరాధన, పుణ్యవచన, రక్షాబంధనవ, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ ప్రసాద వితరణ, మూలదేవత హోమాలు, సాయంత్రం 4:45 గంటలకు మూల మండప ఆరాధన, మహాగణపతి లక్ష్మీహోమం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరగనున్నాయి.
- 25న సోమవారం కార్తీక బహుళ దశమి ఉదయం 10.02 గంటలకు శ్రీపద్మావతి, గోదా మాత, వేంకటేశ్వరస్వామి వార్లకు అభిషేకం, మూలదేవత హోమాలు, ప్రసాద వితరణ, సాయంత్రం 4.30 గంటలకు లక్ష్మీహోమం, సుదర్శన హోమం, విష్ణు సహస్రనామ పారాయణం, లక్ష్మీదేవి కుంకుమార్చన కార్యక్రమాలు, ప్రసాద వితరణ పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటలకు గీతా భక్త సమాజం, వికాస తరంగిణి భక్త బృందంతో విష్ణుసహస్ర నామాలు, కృష్ణాష్టకం, కార్తీక భజనలు, తదుపరి తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
- 26వ తేదీ మంగళవారం కార్తీక బహుళ ఏకాదశి ఉదయం 6.02 గంటలకు హోమం, మహా పూర్ణాహుతి, జయ, విజయ విగ్రహాల ప్రతిష్ఠ. అనంతరం ఉత్సవ విగ్రహాలు, పట్టు వస్త్రాలు ప్రత్యేక గరుడ వాహనంపై గ్రామ పురవీధుల నుంచి ఆట, పాటలతో ఊరేగింపు. ఉదయం 11:02 నిమిషాలకు శ్రీపద్మావతి గోదాసమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం జరపబడును. స్వామివారి దివ్య దర్శనం, బ్రాహ్మణుల ఆశీర్వచనం, రుత్వికులకు సన్మానం, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయి. స్వామివారి కల్యాణం రోజు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పెద్దమ్మ తండా మాజీ సర్పంచ్ కాట్రావంత్ నీలా మోహన్‌నాయక్ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

అతిథులు వీరే..

బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథులుగా శ్రీదండి చిన్నజీయర్ స్వామి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీలు తదితరులు హాజరుకానున్నారని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆవుల రమేశ్, ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్, కోశాధికారి కడల భాస్కర్, ఉపాధ్యక్షులు సీరటి జగదీశ్, కమ్మరి బుచ్చిబాబు, సంయుక్త కార్యదర్శి హైతాబాద్ రాజు పేర్కొన్నారు. వేడుకలకు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఆలయంలో పూజ కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకుడు తొండుపల్లి ప్రేమ్‌శర్మ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు జరగనున్నాయని నిర్వాహకులు వెల్లడించారు.


ఆలయంలో కొలువుదీరిన స్వామివారు

హాస్టళ్లలో వసతులు కల్పించాలి

విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి : తహసీల్దార్ సైదులు


భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ సైదులు

మహేశ్వరం: హాస్టళ్లలో సమస్యలు తలెత్తకుండా వార్డెన్లు తగిన చర్యలు చేపట్టాలని తహసీల్దార్ సైదులు అన్నారు. శనివారం మహేశ్వరం గేటు వద్ద ఉన్న బీసీ గురుకుల హాస్టల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఆదేశించారు. హాస్టళ్లలో సమస్యలు లేకుండా వార్డెన్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చలికాలంలో స్నానాలకు వేడి నీటిని అందించాలన్నారు. అంతకుముందు హాస్టల్‌లో కిచెన్, వంట సామగ్రి, బియ్యం తదితర వాటిని పరిశీలించారు. అదేవిధంగా మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఎంపీడీఓ శైలజ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో డిజిటల్ బోధన, మధ్యాహ్న భోజనం వండడానికి ఉపయోగించే వంట సామగ్రిని పరిశీలించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె ఉపాధ్యాయులు, విద్యార్థులకు సూచించారు.

బీజేపీది చరిత్రాత్మక విజయం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌రెడ్డి


పార్టీ శ్రేణులకు స్వీట్లు తినిపిస్తున్న శంకర్‌రెడ్డి

మీర్‌పేట: మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మకమైన విజయం సాధించిందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. శనివారం మీర్‌పేట కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శంకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు స్వీట్లు పంచి మాట్లాడారు. బీజేపీకి అఖండ విజయాన్ని అందించిన మరాఠా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసిన అన్ని సీట్లలోనూ ఓటమీపాలైందని, రానున్న రోజుల్లో తెలంగాణలో ఇవే ఫలితాలు పునరావృతమవుతాయన్నారు. డిసెంబరు 1 నుంచి 5వ తేదీవరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, వైఫల్యాలపై ఎండగడతామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు కరుణానిధి, ఎడ్ల మల్లేశ్‌ముదిరాజ్, ఇంద్రావత్ రవినాయక్, గౌరీశంకర్, నాయకులు రవినాయక్, చెవ్వ శ్రావణ్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక డ్రైవ్

ఉప తహసీల్దార్ సంతోష్


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీటీ సంతోష్

తలకొండపల్లి: గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిదిద్దేందుకే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని ఉప తహసీల్దార్ సంతోష్ అన్నారు. శనివారం మండల పరిధి గట్టుఇప్పలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆరోగ్య కేంద్రాల్లో డిసెంబర్ 4 వరకు పారిశుద్ధ్య పనులు చేపడతామని పేర్కొన్నారు. సర్కారు బడుల్లో మూత్రశాలలు, తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్‌తో నిత్యం శుభ్రం చేయాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించాలని చెప్పారు.

పశువైద్య శిబిరం

మొయినాబాద్‌రూరల్: మూగజీవాల ఆరోగ్యంపై పాడిరైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి దేవీరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని బాకారం గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పశువులకు చుడి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దేవీరెడ్డితో పాటు డాక్టర్ అహ్మద్, శివకుమార్, శ్రీను, బాలకృష్ణ, యాదయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు

చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీని హైటెక్ నగరంగా తీర్చిదిద్దుతామని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. పుర పరిధి కొంగరకలాన్ 5వ వార్డులో రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. 15 వార్డుల్లో ఇప్పటి వరకు ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతుందని, దీంతో అనేక పరిశ్రమలు కొలువుదీరుతున్నాయన్నారు. రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతుందని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నాని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, స్థానిక నాయకులు గుబ్బరాజు, శిగ మహేందర్, శ్రీనాథ్, మహేందర్, జంగమ్మ, నాగమ్మ, శ్రీకాంత్, అర్జున్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి


పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

కొందుర్గు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి హెచ్చరించారు. శనివారం ఆమె కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని లేనిచో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్‌లు ప్రణాళికా ప్రకారం గ్రామాలను సందర్శించి వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణులకు సరైన వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఐరన్ మాత్రలు అందించాలన్నారు. శిశువులకు సమయం ప్రకారం వ్యాక్సినేషన్ జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ అమృత జోసెఫ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ మంజుల, పీహెచ్ఎన్ లుదియా, ఎంపీహెచ్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

కొందుర్గు: విద్యార్థులకు భోజనం అందించే విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం ఇంద్రానగర్ బాలుర గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల భోజనానికి వినియోగించే కూరగాయలను పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్, స్టాకు రిజిస్టరు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, ఆహార పదార్థాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

షాబాద్: పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో అదే పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయురాలు దుర్గాభవానీ పాఠశాల అభివృద్ధికి రూ.40వేల నగదును విరాళంగా హెచ్ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధికి తమవంతు కృషిచేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నారన్నారు. విద్యార్థులు బావిభారత నిర్మాతలని, వారి ఉజ్వల భవిష్యత్‌కు దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిరెడ్డి, సంఘమేశ్వర్‌రెడ్డి, కిరణ్మయి తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ప్రత్యేకాధికారి సురేశ్‌బాబు


వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

చేవెళ్ల/శంకర్‌పల్లి: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబు కోరారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ వెంకయ్య అధ్యక్షతన వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్‌లలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీలలో గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని, ఆపరేషన్‌లు లేకుండా నార్మల్ డెలివరీలు చేసేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ సంఖ్యను పెంచాలన్నారు. చలికాలం కావటంతో రోజురోజుకు చలితీవ్రత పెరుగుతుందని, దీంతో ప్రజలకు జ్వరాలు ఇతర అనారోగ్యాల బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. దీనిని గుర్తించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిల్లో కావాల్సిన మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో వైద్యులు రేవతి, శ్రీనివాస్, అనూష, ప్రశాంతి, రఘు, సుష్మ, రేష్మ, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కోర్టు సమస్యలపై సర్వే

నందిగామ: మండల పరిధిలోని చేగూరులో న్యాయ కళాశాల విద్యార్థులు శనివారం గ్రామస్తులు ఎదుర్కొంటున్న కోర్టు సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండలంలోని భాస్కరా లా కళాశాల విద్యార్థుల బృందం గ్రామానికి చెరుకొని ఇంటింటికీ తిరిగి కోర్టు సమస్యలు ఏమైనా ఉన్నాయా, వారికి ఏమైనీ న్యాయ సహాయం కావాలో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ప్రొఫెసర్ స్నేహలత మాట్లాడుతూ.. గ్రామస్తుల ద్వారా సేకరించిన సమస్యల పరిష్కారానికి ఏ విధంగా ముందుకు వెళ్లాలనే విషయమై వచ్చే నెలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత న్యాయ శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తం

- యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు
- గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు


వృద్ధులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు, సిబ్బంది

యాచారం: అపరిచితులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. పీఎస్ పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామంలో శనివారం ఆయన స్థానికులతో మాట్లాడారు. గ్రామంలో కొత్తగా ఎవరైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. వృద్ధులు విలువైన ఆభరణాలు ధరించరాదని, రాత్రి వేళలో ఎవరైనా తలుపు తీయమంటే వెంటనే తీయరాదని వెల్లడించారు. యువత మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ షురూ..

- సర్వే వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్న ఆపరేటర్లు
- పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓలు
- పారదర్శకంగా ప్రక్రియ కొనసాగించాలంటూ ఆదేశం

యాచారం/మంచాల: ఓ పక్క సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శరవేగంగా కొనసాగుతుండగా.. మరో పక్క ఎన్యుమరేటర్లు ప్రజల నుంచి సేకరించిన వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మొదలు పెట్టారు. శనివారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో 30 మంది ఆపరేటర్లు 408 కుటుంబాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయగా.. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పరిశీలించారు. మంచాల మండలం గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో డేటా ఎంట్రీ ప్రక్రియను ఎంపీడీఓ బాల శంకర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా యాచారం ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండల పరిధి 15,808 కుటుంబాలకు గాను 14,894 కుటుంబాల సర్వే పూర్తి చేశామని, మిగతా 914 నివాసాల సర్వే చేయాల్సి ఉందని తెలపగా.. 82 శాతం కులగణన పూర్తయిందని, మిగతాది గడువులోగా పూర్తయ్యే లా చూస్తామని మంచాల ఎంపీడీఓ తెలిపారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు ఆపరేటర్లను నియమించామని, తప్పులు లేకుండా నమోదు కొనసాగుతుందని పేర్కొన్నారు.


యాచారం: కంప్యూటరీకరణ చేస్తున్న ఆపరేటర్లు


మంచాల: గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలశంకర్